క్లుప్తంగా

ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి

ధవళేశ్వరం: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగి పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) ఎస్.అబ్రహం అన్నారు. సోమవారం ధవళేశ్వరం బాలుర హైస్కూల్లో ఆయన విద్యార్థులతో కలిసి పరీక్షా పే చర్చా కార్యక్రమాన్ని వీక్షించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో కొత్త కోర్సు ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో అండ్ స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజ్ (ఎన్ఐఎంఎస్ఎంఈ) 30 రోజుల కోర్సును ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ఎంపిక చేసిన 25 మంది విద్యార్థినులకు ఈ నెల 29 నుంచి మార్చి 3వ తేదీ వరకూ తరగతులు జరుగుతాయన్నారు. దీనికి గ్రీన్ లీఫ్ సొల్యూషన్ రాజమహేంద్రవరం వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎన్.శ్రీదేవి, ప్రియాస్ ఫ్లోరల్ సొల్యూషన్స్ వ్యవస్థాపకురాలు డాక్టర్ ఎస్.ప్రియ రిసోర్స్‌పర్సన్లుగా వ్యవహరిస్తారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఏఏ.అన్నపూర్ణ, కె.సునీత, డాక్టర్ ఏ.రాజేశ్వరి, డాక్టర్ బి.మల్లికార్జున పాల్గొన్నారు.

పొట్టిలంకలో చెక్‌పోస్టు

కడియం: మండలంలోని పొట్టిలంక వద్ద జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. పోలీసు, రెవెన్యూ, ఎస్ఈబీ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ చెక్‌పోస్టులో తనిఖీలు నిర్వహించనున్నారు. ఎన్నికల నేపథ్యంలో కడియం మండలం సరిహద్దు గ్రామాలైన పొట్టిలంకతో పాటు దుళ్ల, జేగురుపాడు గ్రామాల్లో కూడా చెక్‌పోస్టులు ఏర్పాటు చేయనున్నట్లు కడియం పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. కాగా.. చెక్‌పోస్టును సోమవారం దక్షిణ మండలం డీఎస్పీ శ్రీనివాసులు సందర్శించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. జాతీయ రహదారిపై తాత్కాలిక స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేసి, వాహనాల వేగాన్ని నియంత్రించేలా చర్యలు చేపట్టారు.

పథకాల అమలుకు ఏఈవోలు కీలకం



డైరీని ఆవిష్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో వ్యవసాయ పథకాల అమలుకు వ్యవసాయ విస్తరణాధికారులు (ఏఈవో) కీలకమని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు అన్నారు. వ్యవసాయ సమాచారదర్శిని ఏఈవోల నూతన డైరీని సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.వేణుమాధవరావు, ప్రచార కార్యదర్శి పీటర్, జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, ఎస్వీ శ్రీనివాస్, నానిబాబు, పీవీ శ్రీను పాల్గొన్నారు.

కరాటేలో రాణిస్తే భవిష్యత్తు

ప్రకాశం నగర్: చదువుతో పాటు విద్యార్థులు కరాటే తదితర వాటిలో రాణించాలని ఎంపీ, సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ అన్నారు. కరాటే మాస్టార్ పిల్లి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్, సర్టిఫికెట్లు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలి

సీటీఆర్ఐ: రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్, ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఓఏఓ మూర్తి, సభ్యుడు కేకే సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో పతకాలు

ప్రకాశం నగర్: విజయవాడ ఫన్ టైమ్స్ టేబుల్ టెన్నిస్ అకాడమీలో జరిగిన 85వ ఏపీ స్టేట్ మాస్టర్స్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ కోచ్ వీటీవీ సుబ్బారావు పాల్గొన్నారు. 50 ప్లస్ పురుషుల సింగిల్స్ విభాగంలో ద్వితీయ బహుమతి, డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారు. రాష్ట్రంలోని వివిధ నగరాలకు చెందిన 120 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీపడ్డారు. కాగా.. కోచ్ సుబ్బారావును జిల్లా అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వి.భాస్కరరామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ, అసోసియేషన్ సభ్యులు, అకాడమీ క్రీడాకారులు అభినందించారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం

ప్రకాశం నగర్: దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. ఆవ వాంబే కాలనీలో సింగవరపు రామకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 30 మంది సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యసూర్యలక్ష్మి, పీసీసీ కార్యదర్శి బెజవాడ రంగారావు, పీసీసీ సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు దేవత సుధాకర్ పాల్గొన్నారు.

రహదారి భద్రత.. సమష్టి బాధ్యత

- ఘనంగా భద్రతా వారోత్సవాలు
- 19 వరకూ నిర్వహణ



రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ జగదీష్, డీటీవో కృష్ణారావు తదితరులు (ఫైల్)

కంబాలచెరువు: ఇంటి నుంచి రోడ్డుపైకి వచ్చి తిరిగి గమ్యస్థానాలకు చేరే వరకూ రహదారి భద్రత చాలా ముఖ్యం. దీనిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి. అందరూ బాధ్యతాయుతంగా ఉంటేనే అంతా సుఖమయం అవుతుంది. చిన్న పొరపాటు జరిగినా నష్టం మాటల్లో చెప్పలేనిది. దీనిపై అవగాహన కల్పించడానికి ఏటా జనవరి 22 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకూ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం డివిజన్‌లో ప్రారంభమైన వీటికి సంబంధించి స్థానిక రవాణాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

నెల రోజులు కార్యక్రమాలు

రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా నెల రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించి జాతీయ, రాష్ట్ర రహదారులపై బ్లాక్ స్పాట్లలో వచ్చే ప్రమాదాల నివారణపై చర్చిస్తారు. నగరంలో బైక్ ర్యాలీలు నిర్వహించి హెల్మెట్ ధారణ, సీటు బెల్టు వినియోగంపై అవగాహన కల్పిస్తారు. మద్యం తాగి వాహనం నడిపితే జరిగే నష్టం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపితే ఏం జరుగుతుందో తెలియజేస్తారు. విద్యార్థులకు రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. స్థానికంగా ఉన్న ఆటో యూనియన్ల సహకారంతో ఆటో, క్యాబ్, లారీ డ్రైవర్లకు సదస్సులు నిర్వహించనున్నారు.

విద్యార్థులకు పోటీలు

స్కూలు స్థాయిలో పిల్లలకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేయనున్నారు. ఈనెల 22న ప్రారంభమైన ఈ మాసోత్సవాల్లో తొలి రోజు రోడ్డు భద్రతపై పోస్టర్లను ఆవిష్కరించారు. 23న విద్యార్థులకు మోటారు వాహన చట్టాలపై అవగాహన, 24న మినీ గూడ్స్ అసోసియేషన్‌తో సమావేశం, 25న మ్యాక్స్, క్యాబ్ డ్రైవర్లకు అవగాహన, 26, 27, 28 తేదీల్లో రోడ్డు సేఫ్టీ కార్యక్రమం, 29న రవాణాశాఖలో వచ్చిన చట్టాలపై అవగాహన కల్పించారు.

19న ముగింపు సభ

మహిళా ద్విచక్ర వాహనచోదకులతో ర్యాలీ, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై అవగాహన, రహదారి భద్రతా నియమాలు పాటిస్తామని చెబుతూ ప్రతిజ్ఞ, డ్రైవింగ్ స్కూళ్లలో రక్తదాన శిబిరాలు, లారీ డ్రైవర్లకు అవగాహన, ఆర్టీసీ డిపోలో సదస్సు, లారీ ఓనర్స్ అసోసియేషన్స్‌తో సమావేశం, షిర్డీసాయి స్కూల్లో విద్యార్థులకు వాహన చట్టాలపై అవగాహన, జీఎస్ఎల్ కాలేజ్‌లో మోటారు వాహన చట్టాలపై అవగాహన, తిరుమల కళాశాల, గౌతమీ స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూళ్లలో సదస్సు, చివరిగా 19వ తేదీన ముగింపు సభ నిర్వహిస్తారు. రహదారి మాసోత్సవాల పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

అవగాహన అవసరం



ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవాలి. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి. ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి సంబంధించి నెల రోజుల పాటు అన్ని ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆటో, లారీ యూనియన్లు, ద్విచక్ర వాహన చోదకులతో సదస్సులు ఏర్పాటు చేశాం. ప్రమాద రహిత జిల్లాగా అందరం కలిసి తీర్చిదిద్దుదాం.

– సంపత్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, రాజమహేంద్రవరం.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్

సీటీఆర్ఐ: స్పందన కార్యక్రమానికి ప్రజలు అందించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సంతృప్తికరంగా పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్ అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ప్రజల నుంచి 22 అర్జీలు స్వీకరించామన్నారు. అర్జీల విషయంలో అధికారులు, సిబ్బంది జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. రాజమహేంద్రవరం కంబాల చెరువు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న టిఫిన్ బడ్డీని తొలగించాలని, వీఎల్ పురంలో సీసీ రోడ్డు, డ్రైనేజీ మంజూరు చేయాలని, ధవళేశ్వరంలో నిర్మించిన టిడ్కో ఇళ్లు స్వాధీన పర్చుకోవడానికి అనుమతించాలని అర్జీలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు పాల్గొన్నారు.

పర్మినెంట్ లోక్ అదాలత్‌పై సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా ప్రధాన న్యాయస్థానం ఆవరణలో సోమవారం ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పర్మినెంట్ లోక్ అదాలత్ ఫర్ పబ్లిక్ యుటిలిటీ సర్వీసెస్ హైలెవెల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు సంబంధించిన వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థల చట్టం 1987 ద్వారా ఏర్పాటు చేసిన పర్మినెంట్ లోక్ అదాలత్ విధులను వివరించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని విద్యుత్, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వైద్యం, తపాలా, టెలిఫోన్, బీమా సంస్థలు, బ్యాంకింగ్ వంటి పది రకాల సేవలకు సంబంధించిన సమస్యలను జిల్లా న్యాయస్థాన ఆవరణలోని పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. దీనికి రూ.కోటి వరకూ పరిధి ఉందని, ఈ తరహా వివాదాలలో కోర్టు ఫీజు లేకుండా రాజీమార్గం ద్వారా సత్వరమైన పరిష్కారం పొందవచ్చన్నారు. రాజీ కుదరని పక్షంలో విచారణ జరిపి తీర్పు ఇవ్వబడుతుందన్నారు. ఈ విషయాలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్మినెంట్ లోక్ అదాలత్ సేవలను మరింత మెరుగైన విధంగా అందించేందుకు పలు సూచనలు చేశారు. సమావేశంలో ప్లాపస్ చైర్మన్ ఏ.గాయత్రీ దేవి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం, ఎస్.శ్రీధర్, వై.లక్ష్మణరావు పాల్గొన్నారు.

లోతైన అవగాహనతోనే లక్ష్య సాధన



డీఈవో అబ్రహాన్ని సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ రమణ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అన్ని అంశాలలో లోతైన అవగాహన పెంచుకోవడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించగలరని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో)ఎస్.అబ్రహం అన్నారు. బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణాసంస్థ (డైట్)లో డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఎల్ఈడి) 2023–25 కేలండర్‌ను ఆయన సోమవారం ఆవిష్కరించారు. అనంతరం డీఈవో అబ్రహంను శాలువా, మెమెంటో, పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కొమ్ముల వెంకట సూర్యనారాయణ రచించిన బాలకథాచంద్రిక కథల సంపుటిని డీఈవోకు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ మాట్లాడుతూ ఛాత్రోపాధ్యాయులు డీఎల్ఈడీ కేలండర్‌ను కూలంకషంగా పరిశీలించి సద్వినియోగ పరచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలరాజు, గంగాధర్, సుజాతారత్నం, జానకీదేవి, ఎస్తర్, కళావతి, రామకృష్ణ, రాజేష్ పాల్గొన్నారు.

భర్తను హత్య చేసిన భార్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): చెడు అలవాట్లకు బానిసైన భర్తను మహిళ హత్య చేసిన సంఘటన స్థానిక రామచంద్రరావుపేటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడబండి సత్తిబాబు (32)కి జ్యోతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తలిద్దరూ గోకవరం బస్టాండ్ వద్ద బిర్యానీ పాయింట్‌లో పనిచేస్తున్నారు. సత్తిబాబు నిత్యం మద్యం తాగి వస్తుండేవాడు. ఈ క్రమంలో సత్తిబాబు ఆదివారం రాత్రి యథావిధిగా ఇంటికి వచ్చాడు. ఆ సమయంలో భార్యాభర్తలిద్దరూ ఘర్షణ పడ్డారు. కోపంతో ఉన్న జ్యోతి కూరగాయలు కోసే కత్తిని సత్తిబాబుపై విసిరింది. సత్తిబాబు పొట్టకు తీవ్రగాయం కావడంతో వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ సత్తిబాబు చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. దీనిపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



మధురపూడిలో సూరిబాబు చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: కోరుకొండ మండలం మధురపూడి, జంబూపట్నం, నర్సాపురం గ్రామాల్లోని పలు కుటుంబాలను వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి సోమవారం పరామర్శించారు. మధురపూడికి చెందిన కొల్లపు సూరిబాబు, మేడే నాగేశ్వరరావు, మద్దాల సుబ్బారావు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను విజయలక్ష్మి ఓదార్చారు. జంబూపట్నంలోని కోరుకొండ ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి తండ్రి తేలు సూర్యచంద్రరావు మృతి చెందారు. అదే గ్రామంలోని వైఎస్సార్ సీపీ నాయకుడు నాగా రమేష్ తండ్రి ఇటీవల వృద్ధాప్యంతో మరణించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట మండలం కో కన్వీనర్ గణేశుల పోసయ్య, నాయకులు బత్తిన త్రిమూర్తులు, ఇండిగమెల్లి సత్యనారాయణ, ఆకుల శ్రీను తదితరులు ఉన్నారు.

బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా భీమేష్

అనపర్తి: వైఎస్సార్ సీపీ తూర్పుగోదావరి జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శిగా గ్రామానికి చెందిన ఎంపీటీసీ–4 కొండేటి భీమేష్ నియమితులయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా నుంచి ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పార్టీ ఆవిర్భావం నుంచి భీమేష్ విశేష సేవలందిస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఇతర నాయకులకు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా, రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని భీమేష్ తెలిపారు. ఈ పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి భీమేష్‌కు జిల్లా పదవిని కట్టబెట్టినట్టు పేర్కొన్నారు. అనంతరం భీమేష్‌ను ఘనంగా సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు భీమేష్‌కు అభినందనలు తెలిపారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని గంగిరెడ్డుల కాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంపై బొమ్మూరు ఎస్సై జుబేర్, సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఆరు 180 ఎంఎల్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. వాటిని అక్రమంగా విక్రయిస్తున్న విత్తనాల విజయలక్ష్మి పరారీలో ఉందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

విశ్వనగరంగా రాజమహేంద్రవరం

- ఎంపీ, సిటీ కో ఆర్డినేటర్ భరత్‌రామ్
- వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ



ఆసరా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్ఐ: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని పర్యాటకంగా, విశ్వనగరంగా అభివృద్ధి చేస్తానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కోఆర్డినేటర్ మార్గాని భరత్‌రామ్ హామీ ఇచ్చారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత కార్యక్రమానికి సంబంధించి సోమవారం నగరంలోని 25, 29 డివిజన్లకు నేతాజీ స్కూల్ సమీపంలోని సచివాలయం వద్ద, 41, 42 డివిజన్లకు పేపర్ మిల్లు సమీపంలోని ఈఎస్ఐ ఆసుపత్రి వెనుక వీధిలో సమావేశాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ భరత్‌రామ్ జ్యోతి ప్రజ్వలన చేసి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

అభివృద్ధిని చూసి గెలిపించండి

ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ గత టీడీపీ చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేశారని ధ్వజమెత్తారు. ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని అమలు చేయలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలతో పాటు మేనిఫెస్టోలో పేరొన్న ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిందన్నారు. తమది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమని జగనన్న ఆచరణలో చూపించారని తెలిపారు. రాజమహేంద్రవరంలో చేసిన అభివృద్ధిని చూసి, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నగర వాసులకు 24 గంటలూ మంచినీరు అందించే బాధ్యత తనదన్నారు. కోటిలింగాలపేట వద్ద గోదావరిలోకి మురుగు నీటిని వదిలే నల్లా ఛానల్, అలాగే మంచినీటిని పంపే యూనిట్ ఒకే చోట ఉండటం వల్ల నగర వాసులకు స్వచ్ఛమైన నీరు అందడం లేదన్నారు. ఇది గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యానికి సజీవ దర్పణమన్నారు. ప్రజల బాగోగులను పట్టించుకోకుండా వారి స్వార్థం, వారి ఖజానాను నింపుకొనేందుకు రాజకీయ పదవులను ఉపయోగించుకున్నారని మండిపడ్డారు.

బ్లేడ్‌బ్యాచ్‌ను పూర్తిగా నిర్మూలిస్తా

తనను ఎమ్మెల్యేగా ప్రజలు ఆశీర్వదిస్తే నగరంలో బ్లేడ్‌బ్యాచ్ అన్నమాట వినబడకుండా చేస్తానని ఎంపీ భరత్ అన్నారు. ఇప్పటికే చాలా వరకూ కంట్రోల్ చేశామని, సంఘ విద్రోహక శక్తులను ఉక్కుపాదంతో అణచి చేస్తానని అన్నారు. రాజకీయ ముసుగులో ఉన్న రౌడీలు, వడ్డీ వ్యాపారులను ఎందుకు ఎన్నుకోవాలని ప్రశ్నించారు. ఈ నాలుగున్నరేళ్లలో నగరాభివృద్ధికి తాను పడిన శ్రమ ప్రజలందరూ చూశారన్నారు. సీఎం జగనన్న సహకారం, ప్రోత్సాహంతోనే ఇది సాధ్యమైందన్నారు. మరోసారి సీఎంగా జగనన్నను గెలిపిస్తే రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందని, ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఇచ్చారు. కార్యక్రమాలలో వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వార్డ్ ఇన్‌చార్జులు అడపా రఘు, కురుమిల్లి శాంతి స్వరూప్, బిల్డర్ చిన్నా, మాజీ కార్పొరేటర్ నీలపాల తమ్మారావు, బెజవాడ రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ఆ తెగలకు అంత్యోదయ కార్డులివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

సీటీఆర్ఐ: ఆదిమ గిరిజన తెగలకు అంత్యోదయ కార్డులివ్వాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 12 జాతులను ఆదిమ గిరిజన తెగలుగా గుర్తించిందన్నారు. వీరిలో కొండరెడ్డి, కోందు, గదబ, పొరజ, చెంచు, సవరలు వంటి జాతులు ఆంధ్రాలో అధిక సంఖ్యలో వున్నాయన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ విషయమై సుప్రీం కోర్టు 2003 మే 2వ తేదీన ఇచ్చిన ఆదేశాల మేరకు రేషన్‌షాపులు నెల పొడవునా నిర్ణీత సమయాలలో తెరిచే ఉంచాలన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో వీరభద్రారెడ్డి, అబ్బాయిరెడ్డి, చిన్నారెడ్డి, మంగాయమ్మ పాల్గొన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్ –1లో గల ట్రాక్‌పై సోమవారం మధ్యాహ్నం సుమారు 35ఏళ్ల వయసు కల్గిన గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని జీఆర్‌పీ స్టేషన్ ఎస్సై పెబ్బిలిలోవరాజు తెలిపారు. రాజమహేంద్రవ రం రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతిచెందిన వ్యక్తి లైట్ గ్రీన్‌కలర్ టీ షర్ట్, లైట్ బ్రౌన్‌కలర్ షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. చామన ఛాయ కలిగి, కోలముఖం కలిగి ఉన్నాడన్నారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు. 94406 27551, 94914 44022 ఫోన్ నంబర్లకు సమాచారం తెలియజేయాలని ఎస్సై లోవరాజు కోరారు.

బీసీ నాయకుల తీరు శోచనీయం

ప్రకాశం నగర్: అధికార, ప్రతిపక్ష పార్టీల్లో పదవులు అనుభవించిన కొందరు బీసీ నాయకులకు ఆ పదవులు పోయిన తర్వాత మాత్రమే బీసీ అస్తిత్వం గుర్తుకు రావడం శోచనీయమని ఏపీ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు ఎద్దేవా చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధిపత్య కులాల పార్టీలు విదిల్చిన అధికార పదవులు అనుభవిస్తున్నంత కాలం బీసీ నాయకులు తమవారి సామాజిక, ఆర్థిక సమస్యల్ని ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఆ పార్టీల అధినాయకుల మెప్పు కోసమే వెంపర్లాడుతుంటారని విమర్శించారు. జనాభాలో 50 శాతం ఉన్న బీసీ ప్రజలను నమ్ముకుంటే నాయకులకు ఆత్మ గౌరవం, బీసీలకు రాజ్యాధికారం, సామాజిక న్యాయం లభిస్తాయన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వంకా మల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన బీజేపీ

ప్రకాశం నగర్ : రాజ్యాంగం మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలను బీజేపీ మంటగలిపిందని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు విమర్శించారు. సోమవారం స్థానిక స్టేడియం వద్ద గల సీపీఐ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సీపీఐ జిల్లా కార్యదర్శి టి.మధు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదను లూటీ చేసి అదానీ, అంబానీలకు కట్టబెట్టి, ఆంధ్ర రాష్ట్రానికి తీవ్రమైన ద్రోహం చేసిన మోదీ, బీజేపీ ప్రభుత్వాన్ని, దాని మద్దతు దారులను ఓడించాలని భారత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక పిలుపునిస్తోందన్నారు. మోదీ హటావో – దేశ్ బచావో అనే నినాదంతో ఫిబ్రవరి 15న సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి బి.పవన్, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రకాశం నగర్: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల సెల్‌ఫోన్ టెక్నీషియన్స్ అసోసియేషన్ యూనియన్ నాయకుల కార్యవర్గ సమావేశం, నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం నగరంలోని ఒక హోటల్లో జరిగింది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల జేఏసీ చైర్మన్‌గా బి.వేణుగోపాల్, జేఏసీ వైస్ చైర్మన్‌గా రమేష్, జేఏసీ ప్రధాన కార్యదర్శిగా నాలి హేమంత్, జేఏసీ గౌరవ సలహాదారులుగా మహ్మద్ ఆరిఫ్, పీవీ రాజేష్‌ను ఎన్నికయ్యారు. జిల్లా జోనల్ జేఏసీ కన్వీనర్‌గా మహ్మద్ ఖలీల్, కాకినాడ జిల్లా కన్వీనర్‌గా పాపారావు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్‌గా షేక్ షబ్బీర్, పశ్చిమగోదావరి జిల్లా కన్వీనర్‌గా రవితో పాటు పలువురిని కోకన్వీనర్లుగా నియమించారు. నియామకాల అనంతరం కమిటీ సభ్యులను ఘనంగా సత్కరించి, ఐక్యంగా ముందుకు సాగేందుకు ప్రతిజ్ఞ చేశారు.

స్పందనలో బీజేపీ నాయకుల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో తాము పర్యటించిన సమయంలో ప్రజల సమస్యలను గుర్తించామని, వాటిని వెంటనే పరిష్కరించాలని బీజేపీ నాయకులు ఎంపీడీవో డి.శ్రీనివాసరావును కోరారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎన్‌వీబీఎన్ ఆచారి అధ్యక్షతన పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు రొంగల గోపీ శ్రీనివాస్, నియోజకవర్గ కో కన్వీనర్ యానాపు ఏసు, యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి కందుకూరి మనోజ్ మాట్లాడుతూ ధవళేశ్వరంలో రైతుబజార్ నిర్మాణం అసంపూర్తిగా ఉందని, శాటిలైట్ సిటీలో తాగునీటి ట్యాంక్‌ల శుభ్రత జరగడం లేదన్నారు. రూరల్ మండలంలో తడి, పొడి చెత్త కేంద్రాలు పని చేయడం లేదని తెలిపారు.